క్లుప్తంగా

విద్యార్థికి సన్మానం



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థి బాదావత్ శ్రీకాంత్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి మంగళవారం శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాన్ని ఎంచుకుని చదివితే ఉన్నత స్థానాలలో నిలుస్తారన్నారు. విద్యార్థి చదువు కోసం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.హెచ్‌ఎం అండెం కర్ణాకర్, మేడి రమేష్‌గౌడ్, వల్ల వేణు, భద్రు, విష్ణు, వీరాచారి, బొనగాల రమేష్, కృష్ణమోహన్, గణేష్, రాజు, నవీన్‌లు ఉన్నారు.

వరి పంట క్షేత్రాల సందర్శన



వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లి, డీసీ తండాలలోని వరి పంటలను పీఏసీఎస్ డైరెక్టర్ రాములు ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి రాంనర్సయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వరి పొలాల్లో సల్ఫైడ్, జింక్ లోప లక్షణాలను గమనించారు. కాగా పొలాన్ని చీమ నెర్రెలు వచ్చేంత వరకు ఆరబెట్టాలని సూచించారు. పొలం ఆరిన తర్వాత పోషకాల మిశ్రమం 13-0-45 లీటర్ నీటికి 10 గ్రాములు, ఫార్ములా 4ను లీటర్ నీటికి 3 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ఐదు రోజుల తర్వాత చిలేటెడ్ జింక్ ఒకగ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. అమ్మోనియం సల్ఫేట్ లేదా 20-20-0-13 వంటి ఎరువులను వాడకూడదని సూచించారు.

పట్టణ అభివృద్ధికి ప్రణాళిక

నర్సంపేట : నర్సంపేట పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్ అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగడిలో కూరగాయల మార్కెట్ అభివృద్ధికి రూ.27లక్షలు, శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు రూ.12లక్షలు, పాకాల రోడ్డులో శ్మశాన వాటికలో పనుల కోసం రూ.20లక్షలు, పట్టణంలోని ఆఖరి మజిలి భవనం అభివృద్ధి పనులకు రూ.25లక్షలు, క్రిస్టియన్ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు రూ.20లక్షలు, డంపింగ్ యార్డు అభివృద్ధి పనులకు రూ.12లక్షలు, మున్సిపల్ కార్యాలయంలో పలు వాహనాల కొనుగోలుకు రూ.2.50లక్షలు, శానిటేషన్ మెయింటెనెన్స్ కోసం రూ.5లక్షలు, కాకతీయ నగర్‌లో శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.20లక్షల ప్రగతి నిధుల నుంచి వినియోగించుకోవడానికి ఆమోదించుకోవడం జరిగిందన్నారు. మొత్తం 36రకాల అభివృద్ధి పనులకు రూ.259.29లక్షలకు ఆమోదించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, కమిషనర్ వెంకటస్వామి, కౌన్సిలర్లు, అధికారులు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జీవాలకు నట్టల నివారణ మందు

నెక్కొండ : గొర్రెలు, మేకలు నట్టల వ్యాధి (డీ-వార్మింగ్) బారిన పడకుండా జీవాల కాపర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి మమత అన్నారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో మంగళవారం ఆమె మాట్లాడుతూ... నెక్కొండ పశువైద్యశాల పరిధిలో నట్టల నివారణకు ఈ నెల 22నుంచి మార్చి 1వరకు మందును ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. 22న మదిగొండ, హరిశ్చంద్రు తండా, సీతారాంపురం, దీక్షకుంట, 23న రామన్నకుంట తండా, పనికర, గొల్లపల్లి, చంద్రుగొండ, బంజరుపల్లి, 24న అమీన్‌పేట, సూరిపల్లి, అప్పల్‌రావుపేట, నెక్కొండ తండా, టీకే తండా, 25న నెక్కొండ, గుండ్రపల్లి, మడిపల్లి, కస్నాతండా, 27న రెడ్లవాడ, పత్తిపాక, సాయిరెడ్డిపల్లి, పిట్టకాలు బోడుతండా, ఏబీ తండా, 28న గొట్లకొండ, అజ్మీరా మంగ్యా తండా, మహబూబ్‌నాయక్ తండా, లావుడ్యా వాగ్యానాయక్ తండా మూడు తండా జీపీలలో నట్టల నివారణ మందు పంపిణీ చేస్తామన్నారు. జీవాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గీసుకొండలో..

గీసుకొండ : మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం నుంచి గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మండల పశువైద్యాధికారి వడ్డేపల్లి రమేశ్ తెలిపారు. 22న గీసుకొండ, కొనాయమాకుల, మచ్చాపూర్, 23న మనుగొండ, చంద్రయ్యపల్లి, ఊకల్‌లో, 24న వంచనగిరి, శాయంపేట, అనంతారంలో, 25న ధర్మారం, ఎలుకుర్తిలో, 26న పోతరాజుపల్లి, బొడ్డుచింతలపెల్లిలో, 27న గొర్రెకుంట, కొమ్మాలలో, 28న మొగిలిచర్ల, విశ్వనాథపురంలో నట్టల మందు వేసే కార్యక్రమం ఉంటుందన్నారు.

కూలీలకు పని కల్పించాలి

- డీఆర్‌డీఏ ఏపీడీ వీరమల్ల సాయిచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ సాయిచరణ్, పక్కన ఎంపీడీఓ, ఎంపీఓ

గీసుకొండ : ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో అధిక సంఖ్యలో కూలీలకు పనులు కల్పించాలని, ప్రతి నర్సరీలో ఆరు వేలకు తగ్గకుండా మొక్కలను పెంచాలని డీఆర్‌డీఏ ఏపీడీ వీరమల్ల సాయిచరణ్ అన్నారు. మంగళవారం గీసుకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పని చేసే కూలీల బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డులను అనుసంధానం చేయాలన్నారు. మస్టర్ల ఆన్‌లైన్ ప్రక్రియను పెండింగ్ లేకుండా చేయాలన్నారు. క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి, బృహత్ వనాల పనులను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని సూచించారు.ఎంపీడీఓ ఎస్.వీరేశం, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఏపీఓ చంద్రకాంత్, ఈసీ శ్రీలత, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న దామోదర్

నర్సంపేట : విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలని మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్ట్ కుజాంపురం దామోదర్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సంస్కారవికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజం హర్షించని ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. విద్యపై ఆసక్తి పెంచుకుంటూ మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకుంటూ ఎదగాలన్నారు. భవిష్యత్‌ను నాశనం చేసే వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తమ వల్ల తల్లిదండ్రులు, గురువులు, సమాజం అసహ్యించుకునే ఏ తప్పుడు పని చేయనని, ఉన్నతంగా ఎదుగుతానని ప్రతిన బూనాలని అన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలో తమకు ఇష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని అందుకనుగుణంగా కృషి చేస్తూ గమ్యాన్ని చేరాలన్నారు. గమ్యం వైపు ఎదిగే క్రమంలో తమకు ఎదురయ్యే అనేక అవాంతరాలను అధికమించే ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని వివరించారు. పేద స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరి తాము పేదలకు న్యాయం చేసే దిశగా ఎదగాలన్నారు. అందు కోసం విద్యార్థులంతా గొప్ప మహానుభావులు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను చదివి స్ఫూర్తి పొందాలని అన్నారు. సామాజిక సేవా దృక్పథం, దేశభక్తి, పెద్దలు, తల్లిదండ్రుల పట్ల గౌరవం కలిగి ఉండాలని తెలిపారు. ప్రిన్సిపాల్ కుమారస్వామి, తేరాల యుగంధర్, రాజిరెడ్డి, పెండ్యాల సురేందర్, గుర్రం అరుణ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



నర్సంపేట రూరల్: బోనాలతో వస్తున్న భక్తులు

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని సర్వాపురం, ద్వారకపేట గ్రామాల్లోని గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ గుడిలో బోనాల జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేష్, మున్సిపల్ చైర్ పర్సన్ గుంటి రజనీ, నాల్గోవ వార్డు కౌన్సిలర్ శీలం రాంబాబులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శీలం వీరన్న, రామగోని సుధాకర్, గంప రాజేశ్వర్‌రావు, గోపగాని వెంకన్న, కందుకూరి అశోక్, సట్ల సురేష్, బూర్గు సాయి, కోండి రాము, మేర్గు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండలంలోని కొత్తూరులో ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బూర రమ అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. పట్నాలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, చంద్రయ్య, కొమ్ము రాజు, జంగిలి రమేష్, బూస ఐలయ్య, సాంబయ్య, భిక్షపతి, సాంబయ్య, ఒగ్గు కళాకారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి వాహనం బోల్తా

రాయపర్తి : ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బొలెరో వాహనం బోల్తాపడిన సంఘటన మండలంలోని మైలారం శివారులో మంగళవారం చోటు చేసుకుంది. దీంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

వరి పొలంలోకి దూసుకెళ్లిన లారీ

వర్ధన్నపేట : వరి పొలాల్లోకి లారీ దూసుకెళ్లిన సంఘటన మండలంలోని ఇల్లంద శివారులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం వైపునకు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి మండలంలోని ఇల్లంద శివారుకు చేరుకోగా అదుపు తప్పి పక్కనే ఉన్న వరి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థిక అవసరాలకు పొదుపు సంఘాలు

చెన్నారావుపేట : ఆర్థిక అవసరాలకు పొదుపు సంఘాలు దోహదపడుతాయని సమితి అధ్యక్షుడు నూనె కుమారస్వామి అన్నారు. ఈ మేరకు మండలంలోని అమీనాబాద్ బాపూజీ పురుషుల పొదుపు సంఘం 30వ వార్షిక మహాసభ మంగళవారం నిర్వహించారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు మురహరి రవి, ఉపాధ్యక్షుడు బండి దిలీప్, సభ్యులు అముడగాని సురేందర్, కుమారస్వామి, హచ్చ, పల్లకొండ తిరుపతి, రమేష్, అబయ, కరుణాకర్, రఘు, మహేందర్, స్వామిలు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సంగెం : స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ కళావతి అన్నారు. మంగళవారం మండలంలోని కుంటపల్లిలో మహిళల గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావటి వెంకటయ్య, ఏపీఎం కిషన్, సీసీ సురేష్, మాజీ వైస్ ఎంపీపీ కాగితాల జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వాజిద్, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ పండుగ



రాయపర్తి : మండలంలోని బురహాన్‌పల్లి గ్రామంలో మంగళవారం దుర్గమ్మ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దుర్గమ్మకు బోనాలను సమర్పించారు. పంటలు సమృద్ధిగా పండేలా ఆశీర్వదించాలనితమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు పాల్గొని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ సూదుల దేవేందర్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మూనావత్ నర్సింహానాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, పూస మధు, గొల్లపెల్లి రమేష్, ముంజాల రవీందర్‌గౌడ్, రత్నాకర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నల్లబెల్లి : సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అనారోగ్యంతో మృతి చెందగా.. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించకపోవడం బాధాకరమని అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి కొర్నేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బట్టు సాంబయ్య, బాబురావు, శనిగరం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నల్లబెల్లి : సమాచార హక్కు రక్షణ చట్టం-2005 ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను నల్లబెల్లి ఇన్‌చార్జ్ ఎస్సై అజ్మీరా సురేష్ నాయక్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు మధ్య సమాచార హక్కు చట్టం కార్యకర్తలు వారధిగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంగొలి అశోక్ రావు, మేడిపల్లి సుధాకర్ రావు, అడ్డ సతీష్, రగుసాల నగేష్, ఎరుకల నరేష్, అనుముల నరేష్, సంతోష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

నర్సంపేట : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ అలుగునూరి వినయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని గ్రంథాలయానికి మంగళవారం గుడాకేశ అనే ధ్యానం పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సంకల్ప సిద్ధి, ఆత్మ విశ్వాసం, నాడి మండలం శుద్ధి జరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ పద్మారావు, గంటా శ్రీనివాస్, సనత్‌కుమార్, వైస్ ఎంపీపీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్యూమినీ అసోసియేషన్ ఎన్నిక

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ పాఠశాల అల్యూమినీ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయడానికి బుధవారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం సుజాత తెలిపారు. ఎన్నిక చేసిన అసోసియేషన్‌ను రిజిస్ట్రేషన్ చేయించడానికి మధ్యాహ్నం 2.30గంటలకు జరిగే సమావేశానికి పాఠశాల పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని ఆమె కోరారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

చెన్నారావుపేట : కుక్కల దాడిలో గొర్రె పిల్లలను కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నర్సంపేట నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్ రాణా ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన తలబోయిన రాజును సోమవారం రాత్రి పరామర్శించారు.15 గొర్రె పిల్లలు మృతి చెందాయని, సుమారుగా రూ. 50 వేలు నష్టం జరిగిందని, ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామానికి చెందిన చింతల బాలస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా అదే గ్రామానికి చెందిన ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేల సాయం అందించారు. కార్యక్రమంలో గిరిబాబు, సతీష్, మంద నరేష్, కిరణ్, భాస్కర్, రాజు, నవీన్, రాజేందర్, బాలజోజి ఉన్నారు.

ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో..



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాధన్నపేట గ్రామానికి చెందిన గిరబోయిన ఎల్లస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఎంసీపీఐ(యూ)నేతలు పరామర్శించి రూ.6వేల సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందం, రమేష్, గాదెగోని బాబు, కర్నె సాంబయ్య, రాజమౌళి, రాజయ్య, ఐల్లయ్య, నర్సయ్య, సాంబయ్య, చిన్న కట్టయ్య, రాజేందర్, శ్రీనివాస్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో..

వరంగల్ (పర్వతగిరి) : మండల కేంద్రానికి చెందిన నాగుల రాజు తల్లి నాగుల ఐలమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఈ సందర్భంగా మండల జర్నలిస్టు యూనియన్ సభ్యులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

నియామకం

దుగ్గొండి : మండలంలోని రేకంపల్లి గ్రామంలో ఆరెకుల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం నియమించారు. అధ్యక్షుడిగా చెలిక సత్యం, ఉపాధ్యక్షుడిగా ఒలిగే శ్యామరావు, కార్యదర్శిగా రంపీస జలన్, కార్యవర్గ సభ్యులుగా రతన్, విజేందర్ ఎన్నికయ్యారు. ఆ కార్యక్రమంలో ఆరె కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఒలిగె నర్సింగరావు, రంపీస చిరంజీవి, ఎంపీటీసీ సోనిరతన్, యుగందర్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థినులు

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పాఠశాలలో తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, నృత్య ప్రదర్శన, చిత్రలేఖనం, కథలు, పాటలు, కవితలు, సామెతలు, పద్యాల పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఫ్లోరెన్స్ మాట్లాడుతూ..మాతృభాషా కోసం నలుగురు బెంగాలి యువకులు ఫిబ్రవరి 21న ప్రాణాలర్పించారని అన్నారు. 2000 సంవత్సరం నుంచి ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త కల్వచర్ల మోహన్‌రావు, ఉపాధ్యాయులు రమణారావు, ఉమారాణి, శ్రీనివాస్, సంతోష్‌కుమార్, బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మాధవి, మమత, రవికుమార్, సుందర్, రవిందర్, మురళీ, తదితరులు ఉన్నారు.

గీతాంజలి డిజీ స్కూల్‌లో..

నర్సంపేట : నర్సంపేటలోని గీతాంజలి డిజీ స్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు మాట్లాడుతూ మాతృభాష అనేది అమ్మ పాల లాంటి మధురమైనదని కావున ప్రతీ మనిషి తన మాతృభాషను నేర్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పోతన, దాశరథి, సినారె, కాళోజి నాలుగు బృందాలుగా విభజించి తెలుగు ప్రశ్నావళి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు గురువు వేమునూరి గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిని మరిచిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

నర్సంపేట : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వడం మరిచిపోయారని, ఇప్పటి వరకు యువతకు బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించడం లేదని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో మంగళవారం సుమన్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా, ఉద్యోగ పోస్టులను భర్తీ చేయకుండా సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. బంగారు తెలంగాణను నిర్మిస్తామని చెప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తక్షణమే యువతకు 30శాతం నిధులు కేటాయించకపోతే పీవైఎల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల వెంకటస్వామి, ధనసరి సురేష్, రంజిత్, హరిబాబు, విష్ణువర్ధన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

నర్సంపేట : హత్యా రాజకీయాలను ప్రేరేపిస్తున్న ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌పై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో కాంగ్రెస్ యువజన నాయకుడు పవన్‌పై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అవినీతి చిట్టా, భూ కబ్జాలను కాంగ్రెస్ పార్టీ హాథ్ సే హాథ్ జోడో యాత్రలో బహిర్గతం చేసినందుకే ఎమ్మెల్యే తన అనుచరులతో కాంగ్రెస్ యువజన నాయకుడిపై దాడి చేయించారన్నారు. యాత్రలో జరిగిన దాడిపై పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం సిగ్గుచేటని, ప్రజాస్వామ్యంలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సిన పోలీసు ఉన్నతాధికారులను అధికార పార్టీ ఎమ్మెల్యే ఒత్తిడితో ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డు పడుతున్నారన్నారు. తక్షణమే రాష్ట్ర డీజీపీ స్పందించి యాత్రలో జరిగిన దాడిపై విచారణ జరిపించి కాంగ్రెస్ నాయకుడిపై దాడి చేసిన రౌడీ మూకలను, హత్యకు ప్రేరేపించిన ఎమ్మెల్యేపై హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారు

- మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నాగలి పట్టి దున్నుతున్న దొంతి మాధవరెడ్డి

నెక్కొండ : కేంద్రంలో, రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని అలంకానిపేట, రెడ్యా నాయక్ తండా, తోపనపల్లి, వెంకటాపురం, అప్పల్‌రావుపేట గ్రామాలలో మంగళవారం ఆయన హాథ్ సే హాథ్ జోడో యాత్రను చేపట్టారు. యాత్రలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దొంతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలోనే రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానలతో ప్రజలు విసిగిపోయారని ఆయన ఆరోపించారు. రైతుల కోసం రూపొందించిన వరంగల్ రైతు డిక్లరేషన్, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, భూమి ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు, భూమి లేని ఉపాధి హామీ కూలీలకు ప్రతి యేటా రూ.12 వేలు అందిస్తామని ఆయన తెలిపారు. అలాగే రూ. 500లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. దొంతి వెంట టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నర్సంపేట మార్కెట్ మాజీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, నాయకులు రాచకొండ రఘు, గై లక్ష్మణ్, కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయి కృష్ణ, సింగం ప్రశాంత్, పాడిశెట్టి భానుప్రకాశ్, ఇడం పాక ప్రకాశం, మైల వెంకన్న, రాంపెల్లి శ్రావణ్, కొత్తపెల్లి రత్నం, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దాడి అమానుషం

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీ నాయకులపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడం అమానుషమని యువజన కాంగ్రెస్ బుధరావుపేట గ్రామఅధ్యక్షుడు మోడెం ఎల్లగౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై దాడి చేయడం దుర్మార్గమన్నారు. అధికార పార్టీ తప్పులను ఎత్తి చూపుతున్నందునే పవన్‌పై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. పవన్‌కు ప్రాణానికి ఏమైనా జరిగితే కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు.

బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న మురళి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి జెడ్పీఎస్ఎస్‌లో మంగళవారం మ్యాథమెటిక్స్ డే జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రధానోపాధ్యాయులు మురళీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ సెంటర్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రావు, ఫీల్డ్ కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఐలయ్య, అర్చన, ఆనంద్‌కుమార్, సారంగపాణి, అరుణకుమారి, రాజేందర్, భవాని, దుర్గారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలమైన తూము షట్టర్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేట చెరువు జాలు కాల్వ శిథిలమైన తూము షట్టర్‌ను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. చెరువు నిండా నీరున్నా యాసంగి వరి పంటలు పండించుకోలేని దుస్థితిపై రైతుల కన్నీటి వ్యథను ఈ నెల 16వ తేదీన సాక్షి దినపత్రికలో 'తూము శిథిలం.. సాగు దుర్భరం' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఐబీ డీఈ గణేష్, ఏఈ హామీద్‌లు వెంటనే ప్రయత్నాలు మొదలు పెట్టినప్పటికి సుమారు 15ఫీట్ల నీరుండడంతో పనులు చేపట్టేందుకు ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు భారీ క్రేన్ తెప్పించి తూము షట్టర్‌ను తొలగించడంతో కాల్వ నిండుగా నీరు పారుతోంది. దీంతో ఆయకట్టు రైతుల ఆనందానికి అవధులు లేవు. అధికారులు కదిలి వచ్చేలా కథనం ప్రచురించిన సాక్షికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీతోనే సామాజిక వర్గాల అభివృద్ధి

నర్సంపేట : భారతీయ జనతా పార్టీ ప్రతీ సామాజికవర్గ అభివృద్ధికి కృషి చేస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సర్వాపురం శక్తి కేంద్రంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ కందికొండ శ్రీనివాస్ అధ్యక్షతన ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మునుపెన్నడూ లేని విధంగా సామాన్య ప్రజల అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రయోజనకరమైన పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. కేంద్ర కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ప్రాధాన్యత వేరే ఇతర ఏ పార్టీలు ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, సీనియర్ నాయకుడు మద్దికాయల రాంబాబు, మాజీ సర్పంచ్ రజనిభారతి, పట్టణ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు మల్యాల సాంబమూర్తి, బీజేవైఎం అధ్యక్షుడు గూడూరు సందీప్, శక్తికేంద్ర ఇన్‌చార్జ్ కందగట్ల నాగరాజు, తాటికంటి రవి, మండ రాకేష్, సామల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.